క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



క్యాన్సర్ రోగి స్వామినాయుడుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కనకమహాలక్ష్మి

అక్కిరెడ్డిపాలెం: పింఛన్ లబ్ధిదారులు ఎక్కడ ఉన్నా.. మానవతా దృక్పథంతో వారి వద్దకే వెళ్లి అందిస్తూ వలంటీర్లు తమ నిబద్ధతను చాటుకుంటున్నారు. స్థానికంగా అందుబాటులో లేని లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మూడో రోజు సోమవారం కూడా కొనసాగింది. 69వ వార్డు నాతయ్యపాలేనికి చెందిన పంకి సోమునాయుడు(62) క్యాన్సర్ పేషెంట్. అగనంపూడిలోని హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వార్డు వలంటీర్ రెడ్డిమి కనకమహాలక్ష్మి ఆస్పత్రికి వెళ్లి సోమునాయుడుకు వృద్ధాప్య పింఛన్ అందించారు.

హడలెత్తించిన నాగుపాము



నాగుపాముతో స్నేక్ క్యాచర్ కిరణ్

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడి గణేష్‌నగర్‌లో 7 అడుగుల గోధుమ నాగు అక్కడివారిని సోమవారం హడలెత్తించింది. దీంతో స్థానికులు వెంటనే పాములు పట్టే రొక్కం కిరణ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే అక్కడు చేరుకున్న కిరణ్ పామును ఎంతో చాకచక్యంగా పట్టుకుని నిర్మానుష్య ప్రదేశంలో విడిచిపెట్టారు. విషసర్పం కావడంతో ఆందోళన చెందిన ప్రజలు, పామును పట్టి వేరే చోట విడిచిపెట్టడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం



ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్ నగర్‌లో ఓ ద్విచక్ర వాహనం దగ్ధమైంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దయాల్‌నగర్‌కు చెందిన మైలపల్లి కల్యాణ్‌బాబు అనే వ్యక్తి ఆదివారం రాత్రి తన ఇంటి ముందు ఏపీ 39 ఎస్ 8337 అనే ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశారు. ఉదయం లేచి చూసేసరికి అది మొత్తం కాలిపోయి కనిపించింది. గుర్తు తెలియని వ్యక్తులు దీనికి నిప్పంటి ఉంటారని బాధితుడు లబోదిబోమంటున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

శాకంబరిగా కుంచుమాంబ



శాకంబరిదేవి అలంకరణలో కుంచుమాంబ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం కుంచుమాంబ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శాకంబరిదేవిగా సోమవా రం అలంకరించారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు శర్మ ఆధ్వర్యంలో సుమారు 58 రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వ హించారు. వేకువజాము నుంచి భక్తులు శాకంబరిగా అలంకరించిన కుంచుమాంబను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నారాయణ, లేళ్ల కోటేశ్వరరావు, దామోదర్‌రెడ్డి దంపతులు, శ్రీరామ్మూర్తి, సునీత, భవానీ, లలిత జ్యోతిర్మయి, వరలక్ష్మి, త్రిమూర్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష.. జగనన్న సురక్ష

- గంటల వ్యవధిలో దరఖాస్తుల పరిష్కారం
- సీఎం జగన్‌తోనే సుపరిపాలన
ఎమ్మెల్యే నాగిరెడ్డి



70వ వార్డులో సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే



71వ వార్డులో దరఖాస్తుదారుడికి ధ్రువపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: దరఖాస్తుదారులకు గంటల వ్యవధిలోనే న్యాయం చేయడం జగనన్న సురక్ష లక్ష్యమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 70వ వార్డు ద్రోణంరాజు కల్యాణ మండపంలోను, 71వ వార్డు దిబ్బపాలెం సచివాలయంలోను సోమవారం వేర్వేరుగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువపత్రాలను పూర్తిగా ఉచితంగా పొందవచ్చన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువపత్రాలు, పట్టాదారు పాసు పుస్తకాలు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, భూముల రికార్డుల్లో పట్టాదారుని మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో అనుసంధానం చేయడం, క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు సర్టిఫికెట్ వంటి సేవల కోసం దరఖాస్తు చేసుకున్న కొన్ని నిమిషాలు, గంటల వ్యవధిలోను పరిష్కారమవుతాయన్నారు. రికార్డులను పరిశీలించి ఆమోదం పొందిన వారి ధ్రువపత్రాలను వలంటీర్లు నేరుగా దరఖాస్తుదారుల ఇళ్లకు తీసుకెళ్లి అందిస్తారని తెలిపారు. గతంలో చంద్రబాబు అనేక హామీలను ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని, మళ్లీ ఇప్పుడు కల్లబొల్లి మాటలతో ఓట్లు అడిగేందుకు తయారయ్యారని ఆక్షేపించారు. ప్రజల సుఖసంతోషాల కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో దీవించాలని ప్రజలను అభ్యర్థించారు. అనంతరం పలువురికి సురక్ష పథకం ద్వారా మంజూరైన ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమాల్లో జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ, గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వార్డు కార్పొరేటర్లు ఉరుకూటి చందు, రాజాన రామారావు, వార్డు ఇన్‌చార్జులు ఎస్.ఎం.డి.గౌస్, రాజాన వెంకటరావు, సచివాలయ కన్వీనర్లు, వార్డు వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

థాంక్యూ జగనన్నా...

మా కుటుంబసభ్యులు ఎప్పుడూ చెప్పేవారు. క్యాస్ట్ ఇన్‌కమ్ సర్టిఫికెట్స్ కావాలంటే.. ఎమ్మార్వో ఆఫీస్ చుట్టూ నెల రోజులైనా తిరగాలి. ముడుపులిస్తే తప్ప.. నెల తర్వాతైనా వచ్చేది కాదని. కానీ.. కేవలం మూడు రోజుల్లోనే నా చేతిలో సర్టిఫికెట్స్ ఉన్నాయి. మేము తూర్పు కాపు కులానికి చెందిన వాళ్లం. మైగ్రేషన్ సర్టిఫికెట్ కావాలని అధికారులు చెప్పారు. తిరిగే ఓపిక లేక.. మా ఇంట్లో వాళ్లు వద్దనేశారు. మా వలంటీర్ ఇంటికి వచ్చి జగనన్న సురక్ష పథకం గురించి వివరించారు. వివరాలు నమోదు చేసుకొని క్యాంపులో సర్టిఫికెట్ చేతికి అందించారు. థాంక్యూ జగనన్న.

– బొండా లక్ష్మణ ఆదిత్య, చినగంట్యాడ

పశువుల కొట్టంలా.. పాఠశాల మైదానం

- విద్యార్థులు ఆడుకునేందుకు వీల్లేని పరిస్థితి
- అధికారులకు మొరపెట్టుకున్నా చర్యలు శూన్యం



పశువుల వ్యర్థాలతో మైదానం



రాత్రిపూట మైదానంలో పశువులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఆలయ మైదానంలో స్వేచ్ఛగా క్రీడలు ఆడేందుకు వీల్లేకుండా పోతోంది. గ్రామంలో కొందరు పాల వ్యాపారులు పాలు పితికాక ఆవులను గ్రామంలోని రోడ్లపై వదిలేస్తున్నారు. ఉదయం నుంచి ఈ ఆవులు రోడ్లపై సంచరిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తిరిగి ఆవుల యజమానులు సాయంత్రం వీటిని తీసుకుపోయి పాలు పితికి తిరిగి వదిలేస్తున్నారు. దీంతో రాత్రి వరకు వీధుల్లో, రోడ్లపై సంచరిస్తూ జెడ్పీ హైస్కూల్ ఎదురుగానున్న మైదానంలో చేరి మరుసటి రోజు ఉదయం వరకు సేదతీరతాయి. రాత్రి సమయంలో మైదానం పశువుల కొట్టంలా కనిపిస్తుంది. రోజులో ఏ సమయంలోనైనా సుమారు 20 నుంచి 30 వరకు ఆవులు మైదానంలో తిరుగాడుతున్నాయి. దీంతో పాఠశాల విద్యార్థులకు మైదానంలో ఆడే పరిస్థితి లేదు. ఉదయాన్నే పాఠశాల ప్రారంభం అయిన తర్వాత పీడీ ఇస్మాయిల్ మైదానంను శుభ్ర పర్చే పనిలో నిమగ్నమై పోతాడు. పేడ ఎత్తించడం నుంచి తిరిగి మైదానం శుభ్ర పర్చి సాయంత్రం విద్యార్థులను సమాయత్తం చేస్తాడు. మైదానంలో ఆవుల సమస్యను వార్డు కార్పొరేటర్, జోనల్ కమీషనర్, ఏఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం మని పాఠశాల సిబ్బంది, విద్యార్థులు చెప్తున్నారు. ఆవుల యజమానులు గ్రామంలో కొందరితో సయోధ్యగా ఉండటంతో వారి ఆటలు సాగుతున్నాయని వీరి తీరును వ్యతిరేకిస్తున్న వారు అంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారి కోసం ఎన్నో పాట్లు పడుతున్నామని పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, పీడీ మహ్మద్ ఇస్మాయిల్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చాలా మంది యువకులు, పెద్దలు రాత్రి సమయంలో మైదానంలో స్కూల్ పక్కనున్న స్టేజ్‌పై కాలక్షేపం చేస్తూ నిత్యం పశువులు మైదానంను నాశనం చేస్తున్నా చూస్తూ ఉరుకోవడం తప్ప, ఏమీ చేయలేని పరిస్థితి. పాఠశాల పీడీ పట్టుదలతో ఇప్పటికే స్కూల్ విద్యార్థులను జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు తీసుకెళ్లినా గ్రామస్తుల్లో మార్పు రాకపోవడం శోచనీయమని పాఠశాల ఉపాధ్యాయులు వాపోతున్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని వెంపళ్లనగర్, అంబేడ్కర్ కాలనీ ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లారు. లబ్ధిదారులను కలసి వారికి చేకూరిన లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, తరతమ భేదాల్లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నామని తెలిపారు. గడచిన నాలుగేళ్లలో శతశాతం పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, బాబూరావు, గణేష్, వాసు, పైడిబాబు, కరజాడ కృష్ణ, అప్పలనాయుడు, పైడికొండ, విజయలక్ష్మి, రామలక్ష్మి, ఆర్పీలు సంతోషి, వరలక్ష్మి, నూకమ్మ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక



జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ సుభాష్ పార్థీకి స్వాగతం పలుకుతున్న భెల్ జై భీమ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: నగరానికి విచ్చేసిన నేషనల్ ఎస్సీ కమీషన్ చైర్మన్ సుభాష్ పార్థీకి భెల్(హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(జై భీమ్) ప్రతినిధులు విశాఖ విమానాశ్రయంలో సోమవారం సాదర స్వాగతం పలికారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛాలను అందించారు. కమిషన్ చైర్మన్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ సమస్యలపై విన్నవించుకునేందుకు ప్రత్యేక సమయం కేటాయించినట్టు తెలిపారు. ఆ సమావేశంలో జై భీమ్ ప్యానల్ ప్రతినిధులు ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాన్ని కమిషన్ చైర్మన్‌ను అందించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జై భీమ్ ప్యానల్ అధ్యక్షుడు రవి కిషోర్, ప్రధాన కార్యదర్శి జె.రాము, కార్యనిర్వాహక అధ్యక్షుడు హెచ్.భోగేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయంలో చండీ హోమం



త్రిశక్తి దేవాలయంలో హోమం చేస్తున్న అర్చకులు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో సోమవారం మహాదుర్గ అమ్మవారికి సప్తశతి చండీ హోమం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో శాస్త్రోక్తంగా జరిగిన హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహాదుర్గ అమ్మవారికి వేకువజామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.

మేకలకు మేతకు వెళ్లి జారి పడ్డాడా..

అస్థిపంజరం కేసులో పోలీసుల దర్యాప్తు

ఉక్కునగరం: తన వద్ద ఉన్న మేకలకు మేత కోసం చెట్టు ఎక్కి జారిపడిన సంఘటనలో వ్యక్తి మృతి చెందాడా? లేకా ఎవరైనా కొట్టిపడేశారా? అనే అంశంపై స్టీల్‌ప్లాంట్ పోలీసుల దర్యాప్తు సాగుతోంది. కొట్టి పడేస్తే కత్తిని అక్కడ వదలరు, కత్తిపై కనీసం రక్తపు మరకలు లేకపోవడం వంటి అంశాలను పరిశీలిస్తే అతను చెట్టు నుంచి జారి పడటం వల్లే మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. చెట్టు పక్కన నరికిన కొమ్మలు, చెట్టు కింద చెప్పులు ఉండటం వాటికి బలం చేకూరుస్తున్నాయి. అస్థిపంజరం గాజువాకకు చెందిన వ్యక్తిదిగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు తెలుస్తుంది. గాజువాక ప్రాంతంలో గంజాయి సేవిస్తూ చిల్లర దొంగతనాల చేసే వ్యక్తే అతను అని భావిస్తున్నారు. సదరు వ్యక్తి గొర్రెలను దొంగిలించి స్టీల్‌ప్లాంట్ సమీప ప్రాంతంలో తనకు పరిచయం ఉన్న మహిళ వద్ద దాస్తుంటాడని సమాచారం. వాటిని కొంత కాలం తన వద్ద ఉంచి తర్వాత అమ్ముతుంటాడని తెలుస్తుంది. ఇందులో భాగంగా చెట్టు ఎక్కి కొమ్మలు కొట్టే క్రమంలో అతని జారి పడి ఉంటాడని.. ఆ ప్రాంతం రోడ్డుకు దూరంగా ఉండటంతో ఎవరూ గుర్తించలేదని భావిస్తున్నారు. దాదాపు కొలిక్కి వచ్చిన ఈ కేసు విచారణ ఒకట్రెండు రోజుల్లో పూర్తవుతుందని పోలీసు వర్గాల సమాచారం.

పోరాటాలతో విశాఖ ఉక్కును కాపాడుకుంటాం



872వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కును కార్మికులందరు తమ పోరాటాలతో కాపాడుకుంటారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 872వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అనేక మంది ప్రధానమంత్రులు ప్రభుత్వరంగ సంస్థలను నెలకొల్పి పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచారని కొనియాడారు. నేటి పాలకులు మాత్రం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ పేదప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

చార్జీల పెంపు ప్రతిపాదన తగదు



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: టౌన్‌షిప్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న కార్మికులకు విద్యుత్ చార్జీలు పెంచాలని యాజమాన్యం చేస్తున్న ప్రతిపాదన విరమించుకోవాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా ఉన్న చార్జీలను అమాంతం పెంచేందుకు రంగం సిద్ధం చేయడం దుర్మార్గమన్నారు. కనీస నివాసయోగ్యం కాని క్వార్టర్స్‌లో ఉంటున్న కార్మికులపై భారం మోపడం సరికాదన్నారు. ఐఎన్‌టీయూసీతో చేసుకున్న ఒప్పందం వల్ల క్వార్టర్స్ ఖాళీ చేస్తే హెచ్‌ఆర్‌ఏ పొందే అవకాశాన్ని కోల్పోయారన్నారు. విద్యుత్ చార్జీల పెంపు, ఉక్కు హౌస్, స్కూల్ ఫీజులు పెంచుతూ నిర్ణయం తీసుకున్నప్పటికీ గుర్తింపు యూనియన్ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, యు.రామస్వామి, డి.వి.రమణారెడ్డి, డి.సురేష్‌బాబు, సీహెచ్ సన్యాసిరావులు ప్రసంగించారు.

రాహుల్ గాంధీ త్వరలో స్టీల్‌ప్లాంట్ సందర్శన



సమావేశంలో మాట్లాడుతున్న జెర్రిపోతుల ముత్యాలు

పెదగంట్యాడ: కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ త్వరలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించనున్నారని కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేయనున్న నేపథ్యంలో కార్మికులు, ఉద్యోగులు, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు రాహుల్ గాంధీని కోరారన్నారు. స్పందించిన రాహుల్ గాంధీ విశాఖ ఉక్కును సందర్శించేందుకు రానున్నట్టు హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు యరబాల భూలోక, చక్రధరరావు, వర్మ, పెంటయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాంటీన్లపై చర్యలకు వినతి



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: ప్రైవేటు క్యాంటీన్ల ప్రక్షాళనకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. సోమవారం డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి.పాండేను కలిసిన నాయకులు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంటీన్ భోజనంలో నాణ్యతలేని ఆహారంతో ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆరోపించారు. క్యాంటీన్లు మురికి వాతావరణంలో నడుస్తున్నాయన్నారు. పనిచేయని సీలింగ్ ఫ్యాన్లు, దుర్గంధభరిత వాష్‌బేసిన్లు, తాగేందుకు మంచి నీరు కూడా అందుబాటులో ఉండని పరిస్థితని ఆవేదన వ్యక్తం చేశబూరు. ప్రైవేట్ క్యాంటీన్లలో నాణ్యత లేని టీ పౌడర్ వినియోగిస్తున్నా, ప్రైవేట్ ఫ్రూట్ జ్యూస్ షాపులు ఇష్టం వచ్చిన ధరలకు విక్రయించి ఉద్యోగుల్ని లూటీ చేస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వీటిపై అధ్యయనానికి యూనియన్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, ప్రభాకరరెడ్డి, జి.వి.సుబ్బయ్య, బీఎంకే నాయక్, సుదర్శనం, నగేష్, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



బాబాకు అన్నాభిషేకం చేస్తున్న మంత్రి రాజశేఖర్



గురుపౌర్ణమిన షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు



108 రకాల నైవేద్యాలతో పూజలందుకుంటున్న సాయినాథుడు

అక్కిరెడ్డిపాలెం: గురుపౌర్ణమి సందర్భంగా షిర్డీసాయి బాబా మందిరాల్లో సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, 69వ వార్డు తుంగ్లాం, షీలానగర్‌లోని షిర్డీసాయి మందిరాల్లో విశేష పూజలు నిర్వహించారు. అక్కిరెడ్డిపాలెంలోని షిర్డీసాయి మందిరంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు బొడ్డు వెంకటరమణ, కామాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. 69వ వార్డు తుంగ్లాంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి పాల్గొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

అగనంపూడి: గురు పౌర్ణమి సందర్భంగా అగనంపూడి షిర్డిసాయి బాబా మందిరంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవాము జాము నుంచి పంచామృతాభిషేకం, అన్నకూటాభిషేకం జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ ఇన్‌చార్జ్ దాడి రత్నాకర్, వైఎస్సార్సీపీ గాజువాక నాయకుడు తిప్పల దేవన్‌రెడ్డి, ఉక్కు ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, నాయకులు ఇల్లపు ప్రసాద్, జి.పూర్ణానందశర్మ పూజలు జరిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కె.రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, శంభుడు, రామారావు, నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితికాలనీ కళింగవీధి గాంధీబొమ్మ జంక్షన్ వద్ద ఉన్న రామాలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. రామాలయంలో ఉన్న షిరిడి సాయి మందిరంలో సాయిబాబాకి జాలాభిషేకం, క్షీరాభిషేకంతో పాటు అఖండ హారతి, ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వడ్లపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు, ముద్దపు దామోదర్, ఆదారి శ్రీను, బొండా గోవిందరాజులు, అభయ కోదండరామాలయ కమిటీ సభ్యులు ప్రగడ శంకరరావు, ప్రగడ శ్రీనివాస్, కేవీ నారాయణ, బొడ్డ సన్యాసిరావు, పూడి శ్రీను, ప్రగడ రాము, పి.సన్యాసిరావు, బుడ్డ సూరిబాబు, దాకా సత్తిబాబు, బొడ్డ తాత, కళింగ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


పెదగంట్యాడ: గురుపౌర్ణమి వేడుకలను సోమవారం మండలంలోని పలు సాయిబాబా మందిరాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మందిరాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సమతా నగర్‌లో షిర్డీసాయి శాంతిమందిరంలో ఆలయ చైర్మన్ నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో బాబాకు భక్తుల చేతుల మీదుగా అభిషేకాలు చేయించారు. 108 రకాల పిండివంటలతో నైవేద్యం సమర్పించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, సాయిసేవకులు, పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు.

- 64వ వార్డు పరిధిలోని గంగవరం గ్రామంలోని సాయినాథుని మందిరంలో పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబాను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను దర్శించుకుని, అభిషేకాలు చేశారు.
- 76వ వార్డు పరిధిలోని నడుపూరు శివారు హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మించిన కన్యకాపరమేశ్వరి పంచాయతన ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మొగలపల్లి త్రిమూర్తులు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి పాల్గొన్నారు.



అక్కిరెడ్డిపాలెం షిర్డీసాయి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రమాదకరంగా ఫ్లైఓవర్ రోడ్డు



స్టీల్‌ప్లేట్లు, బోల్టులు పైకి తేలిపోయిన దృశ్యం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఫ్లైఓవర్‌పై ప్రతీ పది మీటర్ల నిడివిలో ఏర్పాటు చేసిన స్టీల్ ప్లేట్లు, బోల్టులు పైకి తేలిపోవడంతో వాహనచోదకులు భయపడుతున్నారు. ఏ క్షణం ఎవరు ప్రమాదానికి గురవుతారోనని ఆందోళన వ్యక్తం చేశారు. రాజీవ్‌నగర్ కూడలి నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు వెళ్లే మార్గంలో పది నుంచి 15 చోట్ల స్టీల్ ప్లేట్లు పైకి తేలిపోయాయి. బోల్టులు ఊడిపోవడంతో పైకి లేచి, పదునుగా కనిపిస్తున్న స్టీల్ ప్లేట్లను చూసి వాహనచోదకులు బెంబేలెత్తున్నారు. తక్షణం మరమ్మతులు చేపట్టాలని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్‌అండ్‌బీ అధికారులను వినతిపత్రంలో కోరారు.